సాక్షి
యాదాద్రి భువనగిరి

మంగళవారం । 7 । నవంబర్ । 2023



కట్టుతప్పితే కటకటాలే..
ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే శిక్ష, జరిమానా విధించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. - IIలో



గంజాయి పట్టివేత
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు చోట్ల గంజాయి తరలిస్తూ, సేవిస్తూ పలువురు పోలీసులకు పట్టుబడ్డారు. - IIలో



డిపాజిట్ దక్కాలంటే..
ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థికి డిపాజిట్ దక్కాలంటే పోలైన, చెల్లిన ఓట్లలో ఆరు శాతం ఓట్లు రావాలి. - IIలో

న్యూస్‌రీల్

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగ అవకాశాలు



విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న బహుళజాతి కంపెనీ ప్రతినిధి

భువనగిరి : విద్యార్థులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని బహుళ జాతి కంపెనీ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, దుర్గ తెలిపారు. సోమవారం భువనగిరిలో జాగృతి డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడన్స్‌పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో ప్రావీణ్యం ప్రావీణ్యం ఉండాలన్నారు. తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఎంప్లాయ్ బిలిటిస్కిల్స్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మణిపాల్‌రెడ్డి, అకడమిక్ కో ఆర్డినేటర్ సీహెచ్.నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు



శివాలయంలో స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు చేశారు. శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో అభిషేక పూజలు చేపట్టారు.ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తుల చెంతన సంప్రదాయ పూజలు నిర్వహించారు.అర్చనలు, అభిషేకం, నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు తదితర కైంకర్యాలు గావించారు.

బీఆర్‌ఎస్‌తోనే ముదిరాజ్ హక్కుల సాధన



ఐక్యత చాటుతున్న ముదిరాజ్ మహాసభ నాయకులు, చిత్రంలో పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి : ముదిరాజ్ హక్కుల సాధన బీఆర్ఎస్ పార్టీ గెలుపుతోనే సాధ్యమని రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. భువనగిరి నియోజకవర్గ తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలోని ఏకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు ముదిరాజ్‌లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, రాష్ట్ర ఫిషరీస్ డెవలప్‌మెంట్ చైర్మన్ పిట్టల రవీందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, రైతు సమన్వయ సమితి జిల్లా కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, ముదిరాజ్ మహాసభ నాయకులు పెంట నర్సింహ, జిల్లా అధ్యక్షుడు కొల్పుల హరినాథ్ పాల్గొన్నారు.

చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ మొగులయ్య

మోత్కూరు : ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు ముగిసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య హెచ్చరించారు. సోమవారం మోత్కూరులో సివిల్ పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజలు ప్రలోభాలకు లోనుకావద్దని, స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సీఐ ఎస్.మోతిరామ్, మోత్కూరు, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు, రామన్నపేట ఎస్ఐలు ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, నాగరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

హ్యాట్రిక్ కొట్టాలే..!

మూడోసారి గెలుపు కోసం ఆరుగురు ఎమ్మెల్యేల ప్రయత్నం
- గతంలోనే హ్యాట్రిక్ కొట్టిన వారిలో ముగ్గురు మళ్లీ పోటీ
- వరుసగా కాకుండా.. రెండుసార్లు గెలిచి ఇప్పుడు బరిలో ఉన్నది ఇద్దరు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే వరుసగా రెండుసార్లు గెలిచిన ఎమ్మెల్యేలు హ్యాట్రిక్ విజయం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు వరుసగా రెండుసార్లు గెలిచిన మరో ఐదుగురు ఎమ్మెల్యేలు మూడోసారి ఎన్నికల్లో గెలుపు కోసం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ సాధించాలన్న లక్ష్యంతో ఆరుగురు ఎమ్మెల్యేలు పక్కా వ్యూహాలు రూపొందించుకుంటున్నారు.

- సూర్యాపేట ఎమ్మెల్యే, మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి వరుసగా 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. మూడో విజయం కోసం బరిలో నిలిచారు.
- తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ కూడా ఆ రెండు ఎన్నికల్లో వరుసగా బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచారు.
- 2014లో మిర్యాలగూడలో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన నల్లమోతు భాస్కర్‌రావు, 2018లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. మరోసారి ఆయన పోటీలో ఉన్నారు.
- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున గడిచిన రెండు ఎన్నికల్లో విజయం సాధించారు. ఎమ్మెల్యే గొంగిడి సునీత రెండుసార్లు గెలుపొందారు. వీరంతా మూడోసారి జరిగే ఈ ఎన్నికల్లో గెలుపొంది, హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లూరుతున్నారు.
- 2014లో సీపీఐ అభ్యర్థిగా గెలుపొందిన దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ బీఆర్ఎస్‌లో చేరి, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. దీంతో ఆయన కూడా మూడోసారి విజయం సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

వరుసగా కాకపోయినా..
మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి 2014లో ఎన్నికల్లో గెలుపొందారు. ఆ తర్వాత 2018 ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఆ తరువాత ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి రాజీనామాతో 2022లో వచ్చిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ప్రభాకర్‌రెడ్డి రెండోసారి విజయం సాధించారు. మూడోసారి విజయం సాధించేందుకు ఆయన తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అదేవిధంగా నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య 2009లో కాంగ్రెస్‌నుంచి విజయం సాధించి, 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీలో ఉన్న వేముల వీరేశం చేతిలో ఓడిపోయారు. 2018 ఎన్నికల్లో అదే కాంగ్రెస్ పార్టీ నుంచి రెండోసారి గెలుపొందిన ఆయన ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి పోటీచేస్తున్నారు. ఈసారి ఆయన విజయం సాధించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

గతంలోనే హ్యాట్రిక్ సాధించి మరోసారి పోటీలో..

వరుసగా హ్యాట్రిక్ సాధించిన నేతలు కూడా ఈసారి ఎన్నికల్లో గెలుపొందేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. మళ్లీ గెలిచి జిల్లాలో చరిత్ర తిరగరాయాలనే ధ్యేయంగా ముందుకుపోతున్నారు. కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఎప్పుడో హ్యాట్రిక్ సాధించారు. 1999 నుంచి 2014 వరకు వరుసగా నాలుగుసార్లు గెలిచి నల్లగొండ నియోజక వర్గంలో చరిత్ర సృష్టించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయిన ఆయన ప్రస్తుతం నల్లగొండ నుంచే పోటీచేస్తున్నారు. హుజూర్‌నగర్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఇప్పటికే హ్యాట్రిక్ సాధించారు. నాలుగోసారి ఆయన విజయం సాధించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అంతకు ముందు కోదాడ ఎమ్మెల్యేగా కూడా ఆయన విజయం సాధించారు. కాగా, తుంగతుర్తి నుంచి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి 1985, 1989, 1994, 2004 నాలుగుసార్లు, 2009లో సూర్యాపేట నుంచి గెలిచారు. ఇప్పుడు మరోసారి కాంగ్రెస్ టికెట్ ఇస్తే, తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, చిత్రంలో అదనపు కలెక్టర్, పాల్గొన్న అధికారులు

- జిల్లా ఎన్నికల అధికారి హనుమంతు కె.జెండగే

సాక్షి, యాదాద్రి : పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంతు కె.జెండగే సెక్టార్ ఆఫీసర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్‌హాల్‌లో సెక్టార్ అధికారులకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంపులు, విద్యుత్, వెబ్‌కాస్టింగ్ కోసం త్రీపిన్ సాకెట్లు, టాయిలెట్‌లు, ఫర్నిచర్, టెంట్‌ల ఏర్పాటుపై సమీక్షించారు. మిగిలిపోయిన పనులను త్వరిగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్లపై అవగాహన ఉండాలని, పోలింగ్ స్టేషన్, నియోజకవర్గ నంబర్ సూచిస్తూ పెయింటింగ్ వేశామని, ఎక్కడైనా పెండింగ్ ఉంటే త్వరగా పూర్తి చేయాలని కోరారు. దివ్యాంగులు, 80 ఏళ్ల వయస్సు పైబడిన వారిలో 12–ఈ ఫారాలు అందనివారు ఉంటే వెంటనే గుర్తించి ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొన్నారు. పోలింగ్ రోజున చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈవీఎంలు, ఈవీఎంలకు సీలింగ్ వేయడం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో సామగ్రి పంపిణీ, మాక్‌పోల్, మాక్ పోల్ సర్టిఫికెట్ జారీపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎన్నికల పరిశీలకులు పోలింగ్ స్టేషన్లను సదర్శించినప్పుడు ఏర్పాట్లపై వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి

ఆత్మకూరు(ఎం) : మహిళలు నైపుణ్యత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతి పొందాలని డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి కోరారు. ఉపాధిహామీ పథకంలో వంద పనిదినాలు పూర్తి చేసిన కూలీలకు ఆత్మకూర్(ఎం)లో గరిడేపల్లి కృషి విజ్ఞాన్ కేంద్రం, డీఆర్‌డీఏ సౌజన్యంతో ఉన్నతి ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్యత శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్మి కంపోస్టు, డైరీఫామ్, నర్సరీల నిర్వహణలో నైపుణ్యం పొందడానికి శిక్షణ వారం రోజులుగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయరంగంలో అదనపు అదాయం పొందడానికి శిక్షణ దోహదపడుతుందన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రం, వన నర్సరీని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటా వేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నిరంజన్, ఏపీఓ బొడిగె రమేష్, ఏపీఎం పక్కీరయ్య, జేడీఎం రాజు, జేఆర్‌పీ రేణుక, పద్మ, సీసీ భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే



ఆత్మకూర్(ఎం)లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే చంద్రులామని, నాయకులు

- కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే చంద్రులామని

ఆత్మకూరు(ఎం) : రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని కర్నాటక బీజేపీ ఎమ్మెల్యే, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రులామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అభివృద్ధిని అడ్డుకుంటున్నామని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనువాస్ మాట్లాడుతూ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన 50 మంది బీజేపీలో చేరారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు తడిసిన మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొట్టు అబ్బయ్య, బొబ్బల ఇంద్రారెడ్డి, గజరాజు కాశీనాథ్, ఎడ్ల అనితాసత్తిరెడ్డి, బండి ఉప్పలయ్య, మజ్జిగ నరేష్, కొత్త భాస్కర్‌రెడ్డి, కందుల సంతోష్‌కుమార్, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం
తుర్కపల్లి : ఆలేరు నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే, ఆలేరు ఎన్నికల ఇన్‌చార్జి చంద్రులామని పేర్కొన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్‌తో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాంతీయ పార్టీలతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే తెలంగాణ ప్రజల ఇబ్బందులు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడాల వనితశ్రీనివాస్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కొక్కొండ లక్ష్మీనారాయణ, పురుషోత్తంరెడ్డి, ఆకుల రమేశ్, నరేందర్‌నాయక్, పెండం నర్సింహులు, రామచంద్రం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నల్లగొండ అభ్యర్థిగా ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



నల్లగొండ టౌన్: నల్లగొండ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డిని రాష్ట్ర కమిటీ ప్రకటించింది. సుధాకర్ రెడ్డి మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో ముదిరెడ్డి లింగారెడ్డి చంద్రమ్మ దంపతులకు 3వ సంతానం. ఆయన విద్యాభ్యాసం మఠంపల్లి మిషనరీ హైస్కూల్‌లో, ఇంటర్ మిర్యాలగూడలో, డిగ్రీ నల్లగొండలో, పీజీ ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో సాగింది. ఆయన 1980లో సీపీఎంలో సభ్యుడిగా చేరి వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గతంలో తిప్పర్తి జెడ్పీటీసీగా.. సీపీఎం జెడ్పీఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. జిల్లాలో జరిగిన ప్రజా పోరాటాల్లో ఆయన భాగస్వామ్యం ఉంది. ఎస్ఎల్‌బీసీ తాగు, సాగునీటి కోసం జరిగిన ఉద్యమాల్లోనూ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశానికి మాదిగల శక్తి చూపించాలి



చింతపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంద కృష్ణమాదిగ

చింతపల్లి: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభతో దేశానికి తమశక్తి ఏంటో చూపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూరు గ్రామంలో నిర్వహించిన దేవరకొండ నియోజకవర్గస్థాయి ఎమ్మార్పీఎస్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ.. మాట నిలబెట్టుకోలేదన్నారు. ఈ నెలలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లోనైనా బిల్లు ప్రవేశపెట్టి ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. లేదంటే గతంలో కాంగ్రెస్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. అంతకుముందు చింతపల్లి, వింజమూరులో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో ఎమార్పీఎస్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సహదేవుడు, మారుపాకుల గోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయోగపడని రాయితీ!

- ఈ నెల 17వ తేదీ వరకు పదో తరగతి పరీక్ష ఫీజు గడువు
- ఆదాయ ధ్రువీకరణపత్రం సమర్పిస్తేనే రాయితీ అవకాశం
- నిబంధనల ప్రకారం సర్టిఫికెట్ ఇవ్వడానికి రెవెన్యూ అధికారుల విముఖత
- రాయితీ పొందలేకపోతున్న విద్యార్థులు



ఇచ్చేది తక్కువ.. ఖర్చు ఎక్కువ

భువనగిరి : పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర విద్యా శాఖ కల్పిస్తున్న ఫీజు రాయితీ ఉపయోగపడటం లేదు. వార్షిక పరీక్షల కోసం చెల్లించవల్సిన ఫీజు కోసం ప్రభుత్వం రాయితీ పథకం అమలు చేస్తోంది. కానీ, ఇందులో ఉన్న నిబంధనల కారణంగా ఏ ఒక్క విద్యార్థి ఈ పథకాన్ని అందుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం 2023–24 విద్యా సంవత్సరానికి పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించేందుకు షెడ్యూల్ విడుదలైంది. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 17వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంది. అపరాధ రుసుముతో డిసెంబర్ 20వ తేదీ వరకు అవకాశం కల్పించారు. దీంతో విద్యార్థులు ఫీజు చెల్లించే పనిలో నిమగ్నలయ్యారు.

వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు ఒక్కో విద్యార్థి రూ.125 ఫీజు చెల్లించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇందులో 100 శాతం రాయితీ పొందే అవకాశం ఉంది. అయితే ఆయా వర్గాల విద్యార్థులు ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించవల్సి ఉంటుంది. ప్రభుత్వం చాలా సంవత్సరాలుగా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. కాగా విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో వారికి రూ.20వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.25వేలు ఉండాలనే నిబంధన ఉంది. ఈ నిబంధనలతో విద్యార్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపడం లేదు. రాయితీకి పెట్టిన నిబంధనల ప్రకారం ఇంత తక్కువ ఆదాయంతో సర్టిఫికెట్ ఇచ్చే పరిస్థితి లేదు. రూ.125ల ఫీజు రాయితీ కోసం ఆదాయం సర్టిఫికెట్ తీసుకునేందుకు ముందుగా దరఖాస్తు ఫారం, మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు ఫీజు చెల్లింపు, రెండు సార్లు సర్టిఫికెట్ కోసం మీసేవ కేంద్రాలు చుట్టూ తిరగడానికి రూ.250 వరకు ఖర్చు వస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. ఈ కారణాలతో విద్యార్థులు రాయితీ పొందడానికి అసక్తి చూపడం లేదు.

ఏటా 7 వేలకు పైగా విద్యార్థులు
జిల్లాలో పదో తరగతి విద్యార్థులు ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 213 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ప్రతి సంవత్సరం సుమారు ఏడు వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా మార్చిలో వార్షిక పరీక్షలు రాయవల్సి ఉంటుంది. మొత్తం విద్యార్థుల్లో 70 శాతం మేర బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉంటారు. వీరంతా ఫీజు రాయితీ పొందే అవకాశం ఉంది.కానీ, ఆదాయ సర్టిఫికెట్‌ల జారీలో నిబంధనలు సవరించక పోవడంతో ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశం ఉపయోగపడడం లేదు.

నాలుగు రోజుల్లో 70 నామినేషన్లు

సోమవారం 26 దాఖలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో నాలుగో రోజైన సోమవారం 26 నామినేషన్లు దాఖలయ్యాయి. మూడో రోజు ఆదివారం సెలవు. నాలుగో రోజు నల్లగొండ నియోజకవర్గంలో ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ ఒకరు, నకిరేకల్‌లో బీఎస్పీ అభ్యర్థి, మునుగోడులో సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి ఒకరు, ఇద్దరు ఇండిపెండెంట్లు నామినేషన్లు సమర్పించారు. దేవరకొండలో బీఎస్పీ అభ్యర్థి ఒకరు, ఇండిపెండెంట్ ఒకరు, మిర్యాలగూడలో స్వతంత్ర అభ్యర్థి ఒకరు, బీజేపీ నుంచి ఒకరు, పిరమిడ్ పార్టీ నుంచి ఒకరు, నాగార్జునసాగర్‌లో ఎంసీపీఐ(యూ) నుంచి ఒకరు నామినేషన్ వేశారు. తుంగతుర్తిలో ఇండిపెండెంట్ ఒకరు, హుజూర్‌నగర్‌లో ఎంసీపీఐ(యూ) నుంచి ఒకరు, కోదాడలో ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి ఒకరు, ధర్మసమాజ్ పార్టీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్ ఒకరు, సూర్యాపేటలో రిపబ్లికన్ పార్టీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లు ఇద్దరు నామినేషన్ పత్రాలు సమర్పించారు. భువనగిరిలో డీఎస్పీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్ ఒకరు, అలవెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ నుంచి ఒకరు, ఆలేరు నియోజకవర్గంలో బహుజన ముక్తి పార్టీ నుంచి ఒకరు, ఇండియా ప్రజా కాంగ్రెస్ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లు ఇద్దరు నామినేషన్లు వేశారు. నాలుగు రోజుల్లో మొత్తం 70 నామినేషన్లు వచ్చాయి.

4వ రోజు	నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్లు	ఇప్పటి వరకు మొత్తం
నల్లగొండ	1	08
కోదాడ	3	06
సూర్యాపేట	3	05
మునుగోడు	3	11
నాగార్జునసాగర్	1	05
నకిరేకల్	1	06
ఆలేరు	4	07
తుంగతుర్తి	1	03
మిర్యాలగూడ	3	07
భువనగిరి	3	06
హుజూర్‌నగర్	1	01
దేవరకొండ	2	05
మొత్తం	26	70

ఖైదీలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

నల్లగొండ క్రైం: ఖైదీలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన నల్లగొండలోని జిల్లా జైల్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జైల్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జైలు సిబ్బంది సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ జైలు నుంచి విడుదలైన తర్వాత మంచి పౌరులుగా మారి సమాజంలో గౌరవంగా జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ దేవ్‌లానాయక్, జైలర్ జనార్దన్‌రెడ్డి, డీఎస్పీ శోభన్‌బాబు, రామలింగం పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, నాయకులు

సాక్షి యాదాద్రి : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గవర్నర్ తొలుత స్వామివారిని దర్శించుకున్న అనంతరం భువనగిరిలోని రహదారి బంగ్లాకు వచ్చారు. ఆయనకు స్థానిక బీజేపీ నాయకులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. గవర్నర్ వారితో కాసేపు ముచ్చటించారు. స్థానిక పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. అనంతరం హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోతంశెట్టి రవీందర్, పాశం భాస్కర్, మాయ దశరథ, పడమటి జగన్ మోహన్‌రెడ్డి, నర్ల నర్సింగరావు, చందామహేందర్ గుప్తా, రత్నపురం బలరాం, జనగాం కవితా నర్సింహచారి, కొండం ఉపేందర్, ఎండీ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల పర్వం



నకిరేకల్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి మేడి ప్రియదర్శిని



హుజూర్‌నగర్ ఎంసీపీఐ(యు) అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న వస్కుల సైదమ్మ



మిర్యాలగూడలో బీజేపీ నుంచి నామినేషన్ దాఖలు చేస్తున్న జవ్వాజి సత్యనారాయణ

కట్టుతప్పితే కటకటాలే..

- ఎన్నికల నియమావళిని పాటించాల్సిందే..
- కులం, మతం పేరుతో రెచ్చగొట్టడం నేరం
- ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 ప్రకారం శిక్షలు ఖరారు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు, ఉద్యోగులు, సిబ్బంది ఎవరైనా ఎన్నికల నియమావళిని పాటించాల్సిందే. నిబంధనలు ఉల్లఘిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం శిక్ష, జరిమానా విధించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది.

నిబంధనలు.. శిక్షలు ఇలా..

- మతం, కులం, తెగ, వర్గం, భాషా పరమైన అంశం ఆధారంగా రెచ్చగొట్టడం, శతృత్వాన్ని పెంచడం వంటివి ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 152, 153ఏ ప్రకారం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుంది. ఈ రకమైన చర్యలకు పాల్పడ్డ వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉన్నది.
- ఎన్నికల సందర్భంగా ఇరత పార్టీలకు చెందిన అభ్యర్థి సమావేశాలు, బహిరంగ సభల వద్ద అల్లరి చేయడం, గొడవలు సృష్టించడం, అభ్యంతరకరంగా ప్రవర్తించడం నియమావళి ఉలంఘన కిందకు వస్తుంది. దీనికి ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 127 ప్రకారం ఆరు నెలల కారాగార శిక్ష, లేదా జరిమానా, కొన్ని సందర్భాల్లో రెండూ అమలు చేస్తారు.
- అభ్యర్థి తనకు, తన కుటుంబానికి, తన ఏజెంట్‌కు మినహాయించి ఇతరులను అంటే ఓటర్లను పోలింగ్‌స్టేషన్‌కు తీసుకురావడం, తిరిగి పంపించడానికి ఎటువంటి వాహనాన్ని సమసకూర్చినా, అద్దెకు తీసుకున్నా నేరంగానే పరిగణిస్తారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 133 ప్రకారం మూడు నెలల కారాగార శిక్ష, జరిమానా విధిస్తారు.
- ఎన్నికల నిర్వహణలో పాలు పంచుకునే అధికారి పోటీలో ఉన్న అభ్యర్థులకు లబ్ధి చేకూర్చే పనులు చేయొద్దు. వారి ఓటు హక్కు వినియోగించుకోవడం తప్ప అభ్యర్థికి ఉపయోగకరంగా వ్యవహరించడం చటరీత్యా నేరం.. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 129 ప్రకారం ఆరు నెలల జైలు శిక్ష, జరిమాన, కొన్ని సందర్భాలలో రెండూ అమలు చేసే అవకాశం ఉంది.
- ఏ అధికారి కూడా తగిన కారణం లేకుండా తన ఎన్నికల విధులను ఉపేక్షించొద్దు. కారణం చేప్పకపోతే నియమావళి ఉల్లంఘనగా పరిగణించి సెక్షన్ 134 ప్రకారం రూ.500 జరిమానా విధిస్తారు.
- ప్రభుత్వ సర్వీస్‌ల్లో ఉన్న వ్యక్తి అభ్యర్థికి, ఎన్నికల ఏజెంట్‌గా, పోలింగ్ ఏజెంట్‌గా, కౌంటింగ్ ఏజెంట్‌గా పాల్గొనడం ఎన్నికల నియమావళి ప్రకారం నేరం. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 134ఏ ప్రకారం మూడు నెలల జైలు శిక్ష లేదా జరిమానా, లేదా రెండు అమలు చేసే అవకాశం ఉన్నది.
- పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి ఎలాంటి ప్రజా, బహిరంగ సభలు నిర్వహించొద్దు. సినిమా, టీవీ, లేదా ఇతర సాధనాల ద్వారా ప్రచారం నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, నాటక ప్రదర్శన రూపంలో ప్రచారం చేయడం కూడా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుంది. దీనికి ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 126 ప్రకారం రెండు సంవత్సరాల కారాగార శిక్ష, లేదా జరిమానా.. రెండూ అమలు పరిచే అవకాశం ఉంది.
- ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది, ఏజెంట్ ఓటింగ్‌కు సంబంధించి పూర్తి గోప్యతను పాటించాలి. దీని ఉల్లంఘన చట్టరీత్యా నేరం. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం మూడు నెలల శిక్ష లేదా జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో రెండూ విధించే అవకాశం ఉంది.

జంగ్ తెలంగాణ

డిపాజిట్ దక్కాలంటే..!

కోదాడ: 'నాతో పోటీ పడితే డిపాజిట్ కూడా దక్కనీయను.' అంటూ రాజకీయ నాయకులు తమ ప్రత్యర్థులను ఉద్దేశించి అంటుంటారు. ఎన్నికల్లో పోటీ చేసిన నాయకులకు డిపాజిట్ దక్కలేదంటే ఆ అవమానం భరించలేనిది. మరి ఇంతకీ ఈ డిపాజిట్ దక్కడం అంటే ఏమిటంటే.. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో జనరల్ కేటగిరీ వారైతే రూ.10,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5,000 డిపాజిట్‌గా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద చెల్లించాలి. సదరు అభ్యర్థికి తాను పోటీ చేసిన నియోజకవర్గంలో పోలై, చెల్లిన ఓట్లలో 6 శాతం ఓట్లు రావాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక నియోజకవర్గంలో లక్ష చెల్లిన ఓట్లు పోలైతే 6వేల ఓట్లు వస్తేనే డిపాజిట్ దక్కుతుంది. అంతకు తగ్గితే డిపాజిట్ దక్కలేదు. సదరు డిపాజిట్‌ను అధికారులు జప్తు చేసుకుంటారు. డిపాజిట్ దక్కించుకున్న వారికి ఎన్నికల తర్వాత గెజిట్ పబ్లికేషన్ పూర్తయిన తర్వాత డబ్బులను తిరిగి చెల్లిస్తారు.



నాన్న కోసం..

శాసనసభ ఎన్నికల్లో తమ కుటుంబ సభ్యుల గెలుపే లక్ష్యంగా వారసులు ప్రచారంలో భాగస్వాములు అవుతున్నారు. కుమార్తెలు, కుమారులు ప్రచారంలో పాల్గొంటూ 'మా నాన్నను' గెలిపించాలని ఓటర్లను వేడుకుంటున్నారు.

అన్నీ తానైన శేఖర్‌రెడ్డి కూతురు



నందనం గ్రామంలో మహిళను ఓటు అడుగుతున్న మన్వితారెడ్డి

సాక్షి, యాదాద్రి : బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి కుమార్తె మన్వితారెడ్డి అన్నీ తానైన తండ్రి శేఖర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తున్నారు. తన తండ్రిని మరోసారి గెలిపించాలని పది రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ఆమె పార్టీ శ్రేణులను వెంట తీసుకుని నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు, తన తండ్రి చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

తండ్రికి తోడుగా.. కుమారుడు, కుమార్తె



భువనగిరిలో ప్రచారం చేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి కుమార్తె కీర్తిరెడ్డి



బీబీనగర్ మండలంలో ఓట్లు అభ్యర్థిస్తున్న శ్రీరాంరెడ్డి

సాక్షి, యాదాద్రి : కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి అనిల్‌కమార్‌రెడ్డి పెద్ద కూతురు కీర్తిరెడ్డి, కుమారుడు కుంభం శ్రీరామ్‌రెడ్డి నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ఓటర్లకు వివరిస్తున్నారు. తమ తండ్రి అనిల్‌కుమార్‌రెడ్డి చేసిన సేవా కార్యక్రమాలను వివరిస్తూ ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతున్నారు.

భాస్కర్‌రావుకు వెన్నుదన్నుగా సిద్ధార్థ



మిర్యాలగూడలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడ : అసెంబ్లీ ఎన్నికల్లో 'మా నాన్నకు ఓటు వేసి గెలిపించాలి' అని కోరుతున్నాడు బీఆర్ఎస్ మిర్యాలగూడ అభ్యర్థి భాస్కర్‌రావు తనయుడు నల్లమోతు సిద్ధార్థ. తన తండ్రి భాస్కర్‌రావు హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. సిద్ధార్థ ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, మిర్యాలగూడ అభివృద్ధికి తన తండ్రి భాస్కర్‌రావు చేసిన కృషిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

ప్రచారంలో 'సంకినేని' తనయుడు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : బీజేపీ సూర్యాపేట అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు కుమారుడు సంకినేని వరుణ్‌రావు తండ్రికి తోడుగా ప్రచారంలో పాల్గొంటున్నాడు. జిల్లా కేంద్రంలోని వార్డుల్లో రోజువారీగా ప్రచారం చేస్తూనే.. మరోవైపు సోషల్ మీడియా వేదికగా నియోజకవర్గంలో జరిగిన అవినీతి, అక్రమాలను లేవనెత్తుతూ ప్రజల్లోకి వెళ్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిన నిధులతో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్నారు. ఓటర్లను కలిసి తండ్రికి ఓటు వేయాలని కోరుతున్నాడు.



సూర్యాపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సంకినేని వరుణ్‌రావు

కోదాడలో.. మల్లయ్య తనయ



తమ్మరలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుమార్తె కావ్య, చిత్రంలో కోడలు నవత

కోదాడరూరల్ : బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌ను గెలిపించాలని ఆయన కూతురు కావ్య నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు.. స్థానికుడిగా ప్రజలకు అందుబాటు ఉండే నాయకుడు, తన తండ్రి బొల్లం మల్లయ్యయాదవ్‌కు మరోసారి ఓటు వేసి ఆశీర్వదించాలని ఆమె బొట్టుపెట్టి ఓట్లు అడుగుతున్నారు.

తల్లిని గెలిపించాలని..

యాదగిరిగుట్ట రూరల్ : బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ అభ్యర్థి గొంగిడి సునీతను గెలిపించాలని కోరుతూ.. ఆమె కూతురు అంజనీరెడ్డి ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరిస్తూ.. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. గత రెండు పర్యాయాల్లో తన తల్లి ఈ ప్రాంతంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ మరో అవకాశం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు.



మహబూబ్‌పేటలో బొట్టు పెట్టి ఓటు అడుగుతున్న అంజనీరెడ్డి

తనయుడి గెలుపు కోసం తండ్రి ఆరాటం



కాంగ్రెస్‌ను గెలిపించాలని చింతగూడెంలో ప్రచారం చేస్తున్న తండ్రీ కొడుకులు జానారెడ్డి, జైవీర్‌రెడ్డి

హాలియా : నాగార్జునసాగర్ నియోజకర్గం నుంచి ఈసారి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పోటీ నుంచి తప్పుకుని ఆయన తనయుడు కుందూరు జయవీర్‌రెడ్డిని ఎన్నికల బరిలో నిలిపారు. మొదటిసారి పోటీలో నిలిచిన జయవీర్‌రెడ్డి గెలుపు కోసం జానారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా తనదైన శైలిలో ప్రచారానికి చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలతో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఒక పక్క ఇతర పార్టీల కార్యకర్తలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తూనే.. మరోపక్క 40 ఏళ్లుగా తనపై చూపిన ఆదరాభిమానాలను తన కుమారుడిపై చూపించి ఎన్నికల్లో గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు.

రూ.12.50లక్షల విలువైన గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: గంజాయి తరలిస్తున్న ముగ్గురిని కోదాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ రాహుల్ హెగ్డే విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డు చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం తెల్లవారుజామున పోలీసు వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో రూ.12.50లక్షల విలువైన 50 కేజీల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. బస్సులో అనుమానాస్పదంగా కనిపించిన మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాకు చెందిన పండ్ల వ్యాపారి అవదేశ్ చంద్రశేఖర్‌వర్మతో పాటు అదే ప్రాంతానికి చెందిన గృహిణులు శైల ప్రదీప్ దండకర్, సారిక విలాస్ మోహితెను అరెస్టు చేసి విచారించారు. పట్టుబడిన ముగ్గురు ఈ నెల 3వ తేదీన మహారాష్ట్ర నుంచి రైలులో విశాఖపట్నం వెళ్లి శివారు ప్రాంతాల్లో 50కేజీల గంజాయిని లక్ష రూపాయలకు కొనుగోలు చేసి దానిని 12 ప్యాకెట్లుగా కట్టి నాలుగు లగేజ్ బ్యాగులలో నింపి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రూ.30వేలు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన కోదాడ డీఎస్పీ బి. ప్రకాష్, సీఐ డి. రామకృష్ణారెడ్డి, రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ షేక్ అబ్దుల్ సమద్‌ను ఎస్పీ అభినందించారు.



సూర్యాపేట క్రైం: వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువకులు

గంజాయి విక్రయించడంతో పాటు సేవిస్తున్న యువకులను సూర్యాపేట పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టణ సీఐ జి. రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం. సూర్యాపేట పట్టణంలోని కొత్త వ్యవసాయ మార్కెట్ వద్దకు సోమవారం పెట్రోలింగ్‌లో భాగంగా పోలీసులు వెళ్లగా 10 మంది యువకులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకొని విచారించగా.. నకిరేకల్‌కు చెందిన ఆకారపు నందు దగ్గర గంజాయి కొనుగోలు చేసి సూర్యాపేటలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో సూర్యాపేట పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన షేక్ షరీఫ్, తిరుపతి మదన్, తాళ్లగడ్డకు చెందిన అబ్బగోని శ్రీమాన్, 60 ఫీట్ల రోడ్డుకు చెందిన దున్న విక్రమ్‌తో పాటు రత్నాల శంకర్, సూర్యాపేట మండలం కాసరబాద్ గ్రామానికి చెందిన మల్లెబోయిన సాయి, నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామానికి చెందిన పాలడుగు నరేందర్, పడిదెల మనోహర్ కుమార్, కట్టంగూర్‌కు చెందిన మేడి పవన్, రామన్నగూడెం గ్రామానికి చెందిన గూగులోత్ అరుణ్ ఉన్నట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి ఒక కేజీ 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పది మందిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

చివ్వెంల మండలంలో ఇద్దరు..

చివ్వెంల(సూర్యాపేట): గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వై. అశోక్ రెడ్డి, ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం కుడకుడ గ్రామానికి చెందిన కంచుగొమ్ముల శివ, గాదె టోనీ, సూర్యాపేట పట్టణం తాళ్లగడ్డకు చెందిన గట్టు తరుణ్ కలిసి గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు శివ, టోనీ మున్యా నాయక్ తండాకు చెందిన మహేష్ ద్వారా పెన్‌పహాడ్ మండలానికి చెందిన దినేష్ వద్ద 400గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. ఆ గంజాయిని తీసుకొని సోమవారం తాళ్లగడ్డలో ఉంటున్న తరుణ్ వద్దకు స్కూటర్‌పై వెళ్తుండగా కుడకుడ గ్రామం వద్ద పోలీసులు వారిని పట్టుకొని తనిఖీ చేయగా 20 గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. శివ, టోనీని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగతా ముగ్గురి కోసం వెతుకుతున్నామని పేర్కొన్నారు.

దామరచర్లలో ఇద్దరి అరెస్ట్..

మిర్యాలగూడ అర్బన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు దామరచర్ల మండంలోని తాళ్లవీరప్పగూడెంలో పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన మనోరంజన్ సర్కార్, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ షకీల్ బైక్‌పై దామరచర్ల మండలంలోని తాళ్లవీరప్పగూడెం గుండా వెళ్తుండగా వాహనాల తనిఖీల్లో భాగంగా ఎక్సైజ్ అధికారులు వారి వద్ద ఉన్న సంచుల్లో ఐదు కిలోల ఎండు గంజాయిని గుర్తించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా నల్లగొండలో వారు అద్దెకు ఉంటున్న ఇంట్లో మరో 4.250 కిలోల ఎండు గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 9.250కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, బైక్ సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు రామకృష్ణ, పర్వీన్, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



స్వరూపారాణి (ఫైల్)

సూర్యాపేట క్రైం: బాత్‌రూంలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట పట్టణంలోని సీతారాంపురం కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురం కాలనీలో నివాసముంటున్న అనుములపురి స్వరూపరాణి(53) సూర్యాపేట మండలంలోని కాసరబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తుంది. ఆమె భర్త గతంలోనే చనిపోయాడు. ఒక కుమార్తె ఉండగా ఆమెకు వివాహం చేసింది. స్వరూపరాణి ఒంటరిగానే ఉంటుంది. ఆదివారం రాత్రి ఆమె ఇంట్లో నుంచి ఒక్కసారిగా పొగలు రావడంతో కాలనీవాసులు వెళ్లి చూడగా బాత్‌రూంలో స్వరూపరాణి ముఖం కాలిపోయి అప్పటికే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. స్వరూపరాణి బాత్‌రూంలో కరెంట్ షాక్‌తో కిందపడి చనిపోయిందా.. లేదా గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

భువనగిరి క్రైం: మున్సిపాలిటీలోని రాయగిరి ఆవాసం మసుకుంటకు చెందిన కాకర శంకర్‌రావు వాటర్ ప్లాంట్‌కి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం శంకర్‌రావు భార్య మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ వి. సంతోష్ కుమార్ తెలిపారు. శంకర్‌రావు క్రీమ్ కలర్ ప్యాంట్, బ్లూ కలర్ చొక్కా ధరించాడని, 45 ఏళ్ల వయస్సు ఉంటాడని, ఆచూకీ తెలిసిన వారు 8712662733, 8712662472 నంబర్లకు సమాచారమివ్వాలని ఎస్ఐ సూచించారు.

చింతలపాలెంలో..



గోపి (ఫైల్)

హుజూర్‌నగర్ (చింతలపాలెం): పశువులు మేపేందుకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. సోమవారం ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన కీర్తి గోపి ఆదివారం మధ్యాహ్నం పశువులు మేపేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతడి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి అన్నయ్య కీర్తి అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్(30) అనే అనాథ యువకుడు మిర్యాలగూడ పట్టణంలోని లారీ అసోసియేషన్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం అతడు వ్యక్తిగత కారణాలతో మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో జన్మభూమి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): ఆటో దొంగతనం కేసులో ఓ వ్యక్తికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు జడ్జి కె. శ్రీవాణి సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. నల్లగొండ పట్టణానికి చెందిన మహ్మద్ రఫీక్ మొయినుద్దీన్ తన ఆటోను మీర్‌బాగ్‌కాలనీలో నివాసం ఉంటున్న ఎండీ. హాజీకి కిరాయికి ఇచ్చాడు. హాజీ 2023 జూన్ 22న రాత్రి తన ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూసే సరికి ఇంటి ముందు ఆటో కనబడలేదు. ఆటో యజమాని రఫీక్‌కు విషయం తెలియజేయడంతో నల్లగొండ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన మహ్మద్ సలీం వద్ద ఆటో ఉన్నట్లు తెలిసింది. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. సోమవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలతో ఏకీభవించిన జడ్జి కె. శ్రీవాణి నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

రూ.10లక్షలు పట్టివేత

కోదాడరూరల్: ఎన్నికల తనిఖీల్లో భాగంగా కోదాడలో సోమవారం రూ.10లక్షల నగదు పట్టుబడింది. కోదాడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సీఐ రాము ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో రూ.10లక్షలను గుర్తించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కమీలే, భావన వ్యాపార నిమిత్తం నగదును తీసుకెళ్తున్నారని, సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

రూ.1.34లక్షలు స్వాధీనం..

చౌటుప్పల్: మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు సోమవారం రూ.1.34లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాకు చెందిన శ్యామలరావు హైదరాబాద్ నుంచి స్వస్థలానికి కారులో వెళ్తుండగా వాహనాల తనిఖీల్లో పోలీసులకు నగదు పట్టుబడింది. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో పట్టుబడిన నగదును నల్లగొండలోని ఎస్‌టీఓ కార్యాలయంలో జమ చేశామని సీఐ ఎస్. దేవేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడమనూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సోమవారం ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలంలోని చిన్నగూడెం గ్రామానికి చెందిన జానపాటి వెంకటయ్య(56) ఆదివారం ఉదయం మిర్యాలగూడలో బంధువుల ఫంక్షన్‌కు స్కూటీపై వెళ్లి సాయంత్రం 7గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నిడమనూరు మండలం బొక్కమంతలపహాడ్ సమీపంలోని ఆయిల్ మిల్లు సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం వెంకటయ్య స్కూటీని ఎదురుగా ఢీకొట్టింది. అతడి తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు జానపాటి నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.